హైదరాబాద్ వార్త



# డెంగీ..పై కార్పొరేట్ కాటు

-రోగులకు అవసరం లేకున్నా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్న వైనం
-ఒక్కో రోగి నుంచి రూ.లక్ష నుంచి రూ.5 లక్షలు వసూలు
-డెంగీ విజృంభణను సొమ్ము చేసుకుంటున్న యాజమాన్యాలు
-జ్వరం రాగానే హడలిపోతున్న జనం




హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త

మూడేళ్ళ క్రితం కరోనా బాధితులను పీల్చి పిప్పి చేసిన అనేక ప్రైవేటు ఆసుపత్రులు.. ఇప్పుడు డెంగీ రోగుల జేబులు గుల్ల చేస్తున్నాయి. తప్పుడు రిపోర్టుల్లో ప్లేట్‌లెట్ల సంఖ్యను తక్కువగా చూపిస్తున్నాయి. ప్లేట్‌లెట్లు అవసరం లేకపోయినా ఎక్కిస్తూ డబ్బులు గుంజుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో అనవసరంగా ఫీజులు వసూలు చేయొద్దని వైద్య ఆరోగ్యశాఖ పదేపదే చెబుతున్నా కొన్ని ఆసుపత్రులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు వసూలు చేస్తూ రోగుల్ని ఇబ్బందుల పాలు చేస్తున్నాయి.

## పెరుగుతున్న డెంగీ కేసులు...

రాష్ట్రంలో డెంగీ విజృంభించింది. జ్వరం రాగానే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలన్నీ చేయించుకుంటున్నారు. అయితే నాలుగేళ్ళ తర్వాత ఈసారి డెంగీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని వైద్య వర్గాలు వెల్లడించాయి. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 516 కేసులు నమోదయ్యాయి. ఆ తరువాత పెద్దపల్లి, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోనూ పదుల సంఖ్యలో కేసులు వెలుగు చూశాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు ఇప్పటికే కిటకిటలాడుతున్నాయి. వర్షాలతో పేరుకుపోయిన వ్యర్థాలతో, అపరిశుభ్రమైన వాతావరణంతో మరిన్ని కేసులు నమోదయ్యే ప్రమాదముందని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. సాధారణంగా ఇతర అనారోగ్య సమస్యలు ఏమీ లేకపోతే ప్లేట్‌లెట్లు 20వేల వరకు తగ్గినా కంగారు పడాల్సిన అవసరం లేదు. అనారోగ్య సమస్యలు ఉన్నప్పుడు మాత్రం 50వేల లోపునకు తగ్గితే జాగ్రత్త వహించాలి. చాలా వరకు కేసుల్లో సాధారణ జ్వరానికి చేసే చికిత్సే చాలని వైద్య నిపుణులంటున్నారు.

## డెంగీ లేకున్నా...

అయితే డెంగీతో తమ వద్దకు వస్తున్న రోగుల వద్ద పలు ప్రైవేటు ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. రోగికి 50 వేలకు పైగా ప్లేట్‌లెట్లు ఉన్నా ఐసీయూలో ఉంచి అదనంగా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. నాలుగైదు రోజులు ఉంచుకొని రూ. 1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్టుగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఒకసారి ప్లేట్‌లెట్లు ఎక్కిస్తే రూ.15వేల నుంచి రూ.20వేల వరకు బిల్లు వేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. సాధారణ విష జ్వరాలకు కూడా నాలుగైదు రోజులు ఆసుపత్రుల్లో ఉంచుకొని రూ.లక్ష తగ్గకుండా ఫీజులు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. ఒక డెంగీ ఉన్నా లేకున్నా కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు డయాగ్నోస్టిక్ సెంటర్లు తప్పుడు రిపోర్టులు ఇస్తున్నాయని, ప్లేట్‌లెట్లు ఎక్కువున్నా తక్కువ చేపిస్తున్నాయన్న ఫిర్యాదులు కూడా ప్రభుత్వానికి అందడం గమనార్హం. డెంగీ లేకపోయినా ప్లేట్‌లెట్ల కౌంట్ సరిపడా ఉన్నప్పటికీ ప్రజలకు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## తీవ్రతను తగ్గించడం ఎలా...

డెంగీ జ్వరం వస్తే తీవ్రతను తగ్గించేందుకు చల్లని నీటిలో స్పాంజిని ముంచి రోగి శరీరాన్ని తుడవాలి. కాచి వడపోసిన నీటినే తాగాలి. ఎలక్ట్రాల్ పౌడర్ కలిపిన నీళ్ల, పళ్ళరసాలు ఇవ్వాలి. దీని వల్ల జ్వర తీవ్రత తగ్గి ప్లేట్‌లెట్లు తగ్గడం అదుపులోకి వస్తుంది. రానిపక్షంలో వైద్యుని వద్దకు తీసుకువెళ్ళాలి.

## ఐజీఎం పరీక్ష తప్పనిసరి.

డెంగికి గురైతే ఉన్నట్టుండి తీవ్రమైన జ్వరం భరించలేని తలనొప్పి వస్తుంది. కళ్ళు తెరవడం కష్టంగా ఉంటుంది. చర్మంపై దద్దుర్లు కనిపిస్తాయి. కండరాలు, కీళ్ల నొప్పులు ఉంటాయి. వీటితో పాటు అధిక దాహం, రక్తపోటు పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో డెంగీ నిర్ధారించుకోవడానికి వైద్య పరీక్షలే కీలకం. కేవలం ప్లేట్‌లెట్ కౌంట్, డెంగీ స్ట్రిప్ టెస్ట్, సీరమ్ టెస్ట్ వంటి వాటితో దీనిని నిర్ధారించడం శాస్త్రీయం కాదని వైద్య, ఆరోగ్యశాఖ చెబుతోంది. విధిగా ఐజీఎం పరీక్ష చేయించాలి. ప్లేట్‌లెట్లు 20 వేలలోపు పడిపోతే అది ప్రమాదకరం. 15 వేల కన్నా తగ్గితే డెంగీ మరణాలు సంభవిస్తాయి.

## రక్తస్రావం జరిగితే ప్రమాదకరం : డాక్టర్లు

డెంగీని ముందుగా గుర్తిస్తే 80 శాతం వరకు ఎటువంటి ప్రమాదం లేకుండా చికిత్స పొందవచ్చు. ప్రమాదం లేకుండా చికిత్స పొందవచ్చు. కానీ కొందరికి తీవ్రమైన రక్తస్రావం అవుతుంది. ముక్కు నుంచి కానీ, మలం ద్వారా కానీ, బ్రష్ చేసేటప్పుడు పళ్ల చిగుర్ల మధ్య నుంచి రక్తస్రావం అవుతుంది. ఇలా అధికంగా రక్తస్రావం అయితేనే ప్రమాదకరం. అలాగే మహిళలకు పీరియడ్స్ సమయంలో సాధారణ రక్తస్రావం కంటే ఎక్కువగా అయ్యే అవకాశం ఉంటుంది. దాన్ని వాళ్ళు గుర్తించాలి. అలాంటి సమయాల్లో ప్లేట్‌లెట్ల సంఖ్య 50 వేలున్నా సరే తప్పనిసరిగా ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి ఉంటుంది. రక్తస్రావం లేనప్పుడు 20 వేల వరకు పడిపోయినా ప్రమాదం ఉండదు. ప్రత్యేకంగా ప్లేట్‌లెట్లు ఎక్కించి రోగిని సాధారణ స్థితికి తీసుకురావచ్చు.

# చాదర్‌ఘాట్ బ్రిడ్జిపై విరిగిపోయిన రిటైనింగ్ వాల్

-ప్రమాదకరంగా మారిన రిటైనింగ్ వాల్
-తాత్కాలికంగా బారికేడ్ల ఏర్పాటు
-మరమ్మతు పనులు చేయాలని ప్రజల డిమాండ్



చాదర్‌ఘాట్ బ్రిడ్జి రిటైనింగ్ వాల్‌లో కొంతభాగం విరిగిపోయిన దృశ్యం

మలక్‌పేట, ఆగస్టు 5 ప్రభాతవార్త:

పురాతనమైన ప్రముఖ బ్రిడ్జిలలో ఒకటైన చాదర్‌ఘాట్ బ్రిడ్జి రిటైనింగ్ వాల్‌లో కొంతభాగం విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. పురాతనమైన చాదర్‌ఘాట్ బ్రిడ్జిపై నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అదేవిధంగా పాదచారులు తమ గమ్య స్థానాలు చేరుకోవడంకోసం చాదర్‌ఘాట్ బ్రిడ్జిని ఉపయోగిచడం పరిపాటి. నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు చాదర్‌ఘాట్ బ్రిడ్జి నుండి మలక్‌పేట మీదుగా దిల్‌సుక్‌నగర్, హయత్‌నగర్, సైదాబాద్, ఐఎస్‌సదన్, సంతోష్‌నగర్ తదితర ప్రాంతాలకు వస్తుంటారు. అదేవిధంగా ఈ ప్రాంతాలకు చెందిన ప్రజలు మలక్‌పేట మీదుగా చాదర్‌ఘాట్ బ్రిడ్జి వెంబడి ప్రయాణించి నగరంలోకి వెళుతుంటారు. దీంతో నిత్యం మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుండి చాదర్‌ఘాట్ బ్రిడ్జి వరకు ట్రాఫిక్ జాం అవడం వాహనదారులందరికీ సుపరిచితమే అంటే అతిశయోక్తి కాదు. అంతటి ప్రముఖమైన చాదర్‌ఘాట్ బ్రిడ్జికి సరిగా మరమ్మతులు చేయకపోవడంతో బ్రిడ్జి రిటైనింగ్ వాల్‌లో కొంతభాగం విరిగిపోయింది. అదేవిధంగా బ్రిడ్జికి ఇరువైపుల కొంతమేర రిటైనింగ్ వాల్ దెబ్బతింది. బ్రిడ్జి రిటైనింగ్ వాల్‌లో కొంతభాగం విరిగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జి వెంబడి ప్రతినిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించడంతోపాటు పాదచారులు భయాందోళనలకు గురవుతున్నారు. వర్షాకాలం కావడంతో బ్రిడ్జి మరింత దెబ్బ తినకుండా వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రిటైనింగ్ వాల్ కొంతభాగం విరిగిపోవడంతో ప్రమాదవశాత్తు ప్రజలు పడిపోయే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విరిగిపోయిన రిటైనింగ్ వాల్ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు యుద్ధప్రాతి పదికన చాదర్‌ఘాట్ బ్రిడ్జి రిటైనింగ్ వాల్ విరిగి పోయిన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# రూ.400.కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన రెవెన్యూ అధికారులు

- 8.ఎకరాలలో వెలిసిన అక్రమ వెంచర్‌ను తొలగించిన సిబ్బంది




గండిపేట మండలం వట్టినాగులపల్లి సర్వే నెంబర్ 132లో వెలిసిన అక్రమ వెంచర్‌ను తొలగించి, ప్రభుత్వ స్థలమని బోర్డు పెట్టిన అధికారులు

నార్సింగి, ఆగస్టు 5 ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా గండిపేట మండల రెవెన్యూ అధికారులు రూ. 400.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి విడిపించారు. అధికారుల తీరు పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గరీబోళ్లు గుడిసె వేసుకుంటే వెంటనే తొలగించే అధికారులు ఎకరాల కొద్ది సర్కారు భూమిని చెరబట్టిన వారిని ఎందుకు పట్టించుకోవడం లేదని ఇన్నాళ్లు స్థానికులు ఆగ్రహంగా ఉన్నారు. సోమవారం నాటి రెవెన్యూ అధికారుల చర్యతో వారంతా శాంతించి, అధికారుల పనితీరును మెచ్చుకుంటున్నారు. గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామ సర్వే నెంబర్ 132.లో ఉన్న 8.ఎకరాల స్థలంలో వెంచర్లు, ప్లాట్లు చేస్తున్నట్లు స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. రెవెన్యూ సిబ్బంది వచ్చి పరిశీలించారు. ఉన్నతాధికారులకు ఈ కబ్జా విషయంను తెలిపారు. ఐటీ జోన్, ఫైనాన్షియల్ జోన్‌లకు దగ్గరల్లో ఉన్న సర్కారు భూమిని కబ్జా చేసేందుకు ప్రైవేటు వ్యక్తులు ఏకంగా మట్టి రోడ్లు వేసి, ప్లాట్ల హద్దులు అన్నీ పాతారు. తక్కువ ధరకే ప్లాట్లు విక్రయిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. ప్లాట్లు విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంతలో రంగారెడ్డి జిల్లా అధికారుల నుంచి అక్రమ వెంచర్‌ను తొలగించాలని, నిర్మాణాలుంటే కూల్చి వేయాలని స్పష్టమైన ఆదేశాలు రావడంతో గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్.ఐలు సురేష్, విక్రమ్‌రెడ్డిలు జేసీబీలను వెంట తీసుకెళ్లి రోడ్లు, హద్దురాళ్ల అన్నింటిని తొలగించారు.

ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదని తెలిపే బోర్డులను అక్కడ పాతారు.

# స్వచ్ఛదనం పచ్చదనంలో అందరూ భాగస్వాములు కావాలి : మేయర్




పంజగుట్ట, ఆగస్టు 5,ప్రభాతవార్త:

స్వచ్ఛదనం,పచ్చదనం అందరి సామాజిక బాధ్యత అని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన స్వచ్ఛదనం,పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎన్‌బీటీనగర్‌లో మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమీషనర్ అమ్రపాలి కాట, జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతితో కలిసి లాంఛనంగా ప్రారంబభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.నగరాన్ని స్వచ్ఛ ఆరోగ్య, ఆహ్లాదకరమైన నగరంగా తీర్చదిద్దుటకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామని వివరించారు.ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు బయట కూడా స్వచ్ఛంగా ఉండేలా బాధ్యత వహించాలన్నారు. నగరంలో 4 వేలకు పైగా స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణ జరుగుతున్నా ఇంకా చెత్త బయట వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చెత్త సేకరణ బండ్లకుతడి పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలని కోరారు. ఎన్‌బీటినగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. చెత్త బయట వేస్తే జరిమానా వేస్తామని ఆమె చెప్పారు.జీవీపీ పాయింట్‌ల వద్ద సీసీ కెమరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెత్త కుండీ పాయింట్స్ ఎలిమినేట్ చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. జీహెచ్ఎంసీ కమీషనర్ అమ్రపాలి కాట మాట్లాడుతూ నగరంలో పచ్చదనం, పరిశుభ్రత పెంచేందుకు గ్రేటర్ వ్యాప్తంగా ఐదురోజుల పాటు సుందరీకరణతో పాటు పరిశుభ్రత పనులు చేపడుతున్నామని తెలిపారు.

-ప్రజలు సహకరించాలి : కమిషనర్ అమ్రపాలి

హైదరాబాద్ నగరంలో శుభ్రత మరింత పెంచేందుకు వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతున్నామని తెలిపారు.నగర ప్రజలు రోడ్లపై చెత్త వేయడం మానుకోవాలన్నారు. దోమల నివారణ, వ్యాధుల నియంత్రణకు అన్ని రకాల చర్యలు చేపట్టామని తెలిపారు.అందరూ ఫ్రైడేను డ్రైగా భావించాలని కోరారు.కుక్కల నుండి జాగ్రత్తగా ఉండాలని చిన్న పిల్లలను బయటకు పంపేటపుడు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కుక్కల స్టెరిలైజ్ చేయుటకు చర్యలు తీసుకున్నట్లు అందుకోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆమె తెలిపారు.వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని పార్కుల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, క్రీడా మైదానాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టామని, ప్రతి ఇంటికి మొక్కలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఖైరతాబాద్ జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఖైరతాబాద్ పరిధిలో 700 స్వచ్ఛ ఆటోలు ఇంటింటినుంచి చెత్త సేకరిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ ప్రశాంతి, చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై దృష్టి సారించాలి

-జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ అమ్రపాలి

హైదరాబాద్, ఆగస్టు 5,ప్రభాతవార్త:

ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి అధికారులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల పరిష్కారానికి నగరం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలిరాగా కమిషనర్ అమ్రపాలి ప్రజలనుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులు ప్రత్యేక దృష్టిసారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి జాప్యం లేకుండా సమస్యను పరిష్కరించి సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని పరిష్కారం కానట్లయితే అందుకు గల కారణాలు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఫోన్‌ఇన్ ద్వారా 8 విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, శ్రీవాత్సవ, సత్యనారాయణ, యాదగిరి రావు, గీతారాధిక, అడిషనల్ సిసిపిలు గంగాధర్ ,ప్రదీప్, ఎస్ఎన్‌డిపి సిఈ కోటేశ్వర్‌రావు ,సిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పద్మజా, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్యారిస్ నుండి తిరిగి వచ్చిన బ్యాక్సర్ నికత్ జరీన్‌కు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికిన అభిమానులు

# ప్రజలందరూ పచ్చటి చెట్లను పెంచాలి

- ఇరిగేషన్ అండ్ సిఎడి స్పెషల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్



మొక్కలు నాటుతున్న ఇరిగేషన్ స్పెషల్ సెక్రెటరీ ప్రశాంత్, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌లు

నార్సింగి, ఆగస్టు 5 ప్రభాతవార్త : ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పచ్చటి చెట్లను పెంచాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇరిగేషన్ అండ్ సిఎడి స్పెషల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, మేయర్ మద్దెల శ్రీలత ప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కమీషనర్ శరత్‌చంద్రలతో కలిసి "స్వచ్ఛదనం-పచ్చదనం" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ఎంపి, జడ్‌పిహెచ్ఎస్, గౌతం, రావూస్ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి పచ్చదనం, పరిశుభ్రతలపై పెద్దపెట్టున నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులంతా కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్రశాంత్ జీవన్, ప్రతిమసింగ్‌లు మాట్లాడుతూ చెట్లు, అడవుల శాతం తగ్గిపోతుండడం వల్లనే వాతావరణంలో మార్పులు వస్తున్నాయని, వాతావరణంలో కాలుష్యంను తగ్గించాలన్నా, వాతావరణం చల్లబడాలన్నా, సకాలంలో వర్షాలు కురువాలన్నా, భూగర్భ జల మట్టం పైపైకి రావాలన్నా మొక్కలు పెంచడం ఒక్కటే మార్గమని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేబట్టిందని, ఇందులో అందరం స్వచ్ఛందంగా భాగస్వాములం అయ్యి మన తల్లిదండ్రులు, బిడ్డల పేర్లు పెట్టుకొని మొక్కలు నాటాలని, వాటిని మూడేళ్ల పాటు సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు వాతావరణంలోని చెడు వాయువులను పీల్చుకొని, మనకు ప్రాణవాయువును విడుదల చేస్తాయని, భారీ వృక్షాలుగా మారితే మేఘాలను ఆకర్షించి వర్షింపచేస్తాయని వివరించారు. ప్రజలు తమ ఇళ్లు,ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటిలో వెలువడే చెత్తను ఆటోల్లోనే వేయాలని, రోడ్ల పక్కన వేయవద్దని సూచించారు. పరిశుభ్రతను పాటిస్తే 90.శాతం రోగాలకు మనం దూరంగా ఉండవచ్చిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు చంద్రశేకర్, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, రాము, అనిత, అస్లాం, మేనేజర్ మంజులత, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నగర శివారులో మిస్టరీగా మారిన బాలుడి అదృశ్యం

-ట్యూషన్‌కు వెళ్ళి తిరిగి రాని బాలుడు.. గాలిస్తున్న పోలీసులు



అదృశ్యమైన బాలుడు మహీధర్‌రెడ్డి (ఫైల్ ఫోటో)

సరూర్‌నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:

హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలుడి అదృశ్యం మిస్టరీగా మారింది. ట్యూషన్‌కు వెళ్తున్నానని ఇంటి నుండి బయలు దేరిన విద్యార్థి అటు ట్యూషన్‌కు వెళ్ళక ఇటు ఇంటికి తిరిగి రాకపోవడం కలకలం రేపింది. బాలుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో స్పందించిన పోలీసులు రంగంలో దిగి చేసిన దర్యాప్తులో సిసి పుటేజీలు పోలీసులను హైరానా పెట్టించాయి. మీర్‌పేట్ పరిధిలో చూసిన పుటేజీలో ఓ వ్యక్తి స్కూటీపై బాలుడు వెళ్తుండడంతో కిడ్నాప్ జరిగిందని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ కేసు కాస్తా పోలీస్ కమీషనర్ దృష్టి వరకు వెళ్ళింది. పోలీసుల విచారణలో వెలుగు చూసిన మరో సిసి పుటేజీలో అదృశ్యమైన బాలుడు ఒక్కడే మలక్‌పేట్ రైల్వే స్టేషన్‌లో టిక్కెట్ తీసుకుంటున్నట్లు కనిపించడంతో కిడ్నాప్ కాలేదని ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చారు. అయినప్పటికీ బాలుడి ఆచూకీ తేలకపోవడంతో బాధిత కుటుంబంలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. కర్నూల్ ప్రాంతానికి చెందిన గునంపల్లి మధుసూదన్‌రెడ్డి, కవిత దంపతులు చాలా సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చి జిల్లెలగూడ దాసరి నారాయణరావు కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. అయితే మీర్‌పేట్ ఎస్ఆర్‌డిజి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న రెండవ కుమారుడు మహీధర్‌రెడ్డి (13) ఆదివారం ట్యూషన్ నిమిత్తం ఇంటి నుండి వెళ్ళి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో తల్లి కవిత ఆదివారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఇన్స్‌పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు చేసిన పోలీసులు కొన్ని సిసి పుటేజీలు పరిశీలించగా ఓ గుర్తు తెలియన వ్యక్తి స్కూటీపై బాలుడు వెళ్తున్నట్లు కనిపించింది. దీంతో బాలుడు కిడ్నాప్ అయ్యాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇదిలా ఉండగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో విచారిస్తే మలక్‌పేట్ రైల్వే స్టేషన్‌లో బాలుడి దృశ్యాలు కనిపించాయి. అయితే బాలుడు ఒక్కడే టిక్కెట్ తీసుకొని వెళ్తుండడంతో కిడ్నాప్ కాలేదని నిర్ధారణకు వచ్చారు. అయితే బాలుడు కనిపించకుండా పోయి దాదాపు 36 గంటలకు పైగా గడుస్తున్నప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాలుడి కుటుంబంలో ఆందోళన తీవ్రమవుతున్నది. కాగా బాలుడి ఆచూకీ కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా గాలిస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ నాగరాజు తెలియజేశారు.

# ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటా

-ఎమ్మెల్యే తలసాని



కళ్యాణ లక్ష్మీ చెకు ్కలను అందజేస్తున్న ఎమె ్మల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

కంటోన్మెంట్,ఆగస్టు5 ప్రభాతవార్త: ఎవరికి ఏ అవసరం వచ్చిన ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో నియోజకవర్గం పరిధిలోని 80 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి మంజూరైన 28.86 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అదే విధంగా 30 మందికి షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను తలసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి సిఎం కేసిఆర్ ప్రభుత్వంలోనే ఆడపిల్లల తల్లిదండ్రులకు భారం పడకుండా 1 లక్ష 116 అందజేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు కొలను లక్ష్మి, టీ.మహేశ్వరీ, మాజీ కార్పోరేటర్, శేషుకుమారి, బిఆర్ఎస్ నాయకులు ఆకుల హరిక్రిష్ణ, అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, హన్మంత్ రావ్,

# బల్కంపేట ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

సంజీవరెడ్డి నగర్, జూలై 5, ప్రభాతవార్త

బల్కంపేట్ ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో 19.06.2024 నుండి 05.08.2024 వరకు 47 రోజుల పాటు భక్తులు వేసిన కానుకల హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం ఏఈ, ఈఓ బి.కృష్ణ, ఆలయ చైర్మన్, కె.సాయిబాబాగౌడ్ సమక్షంలో నిర్వహించారు. సాధారణ హుండియల్ నోట్‌లు రూ.81,16,115, నాణేలు రూ.2,58,850, మొత్తం రూ.83,74,965 అలాగే అన్నదానం హుండీ రూ.1,39,127 మొత్తం హుండియల్‌ల ఆదాయం రూ.85,14,092, విదేశీ కరెన్సీ యూఎస్ డాలర్స్ 133, సింగపూర్ డాలర్లు 10, యూఏఈ దిర్హామ్‌లు 25, ఆస్ట్రేలియా డాలర్లు 5 స్కాట్లాండ్ పౌండ్ 10, మలేషియా రింగిట్ 1, ఓమన్‌బైసా 100, చైనా యువన్ 10 హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీదేవి ఇన్స్‌పెక్టర్ దేవాదాయ శాఖ సికింద్రాబాద్, ఆలయ సిబ్బంది, భక్తులు, బ్యాంక్ ఆఫ్ బరోడా ఎస్ఆర్ నగర్ శాఖ అధికారులు, ఆల య సూపరింటెండెంట్‌లు రంగు రమేష్, హైమవతి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం-పచ్చదనంపై ప్రజలకు సంపూర్ణ అవగాహన అవసరం : మేయర్ పారిజాత



బడంగ్‌పేట్‌లో మొక్కలు నాటిన మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** స్వచ్ఛదనం-పచ్చదనం ఆవశ్యకతపై ప్రజలకు సంపూర్ణ అవగాహన అవసరమనీ ఈ మేరకు వారిని చైతన్య పరిచే కార్యక్రమాలు విరివిగా చేపట్టాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం కమీషనర్ రఘు ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్ చౌరస్తాలో ర్యాలీని ప్రారంభించి మొక్కలు నాటిన ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత, కలుషిత నీరు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సూర్ణగంటి అర్జున్, డిఇఇ జ్యోతిరెడ్డి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి, కార్పొరేటర్లు గూడెపు ఇంద్రసేన, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు గౌర శ్రీనివాస్, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, రామిడి వీరకర్ణారెడ్డిలతో పాటు కార్పొరేషన్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్లలో ఘనంగా స్వచ్ఛదనం, పచ్చదనం



కార్యక్రమంలో పాల్గొన్న చిలుక ఉపేందర్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న దయానంద్‌గుప్త, హేమంత్‌కేశవ్‌పాటిల్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** పరిసరాలను పరిశుభ్రంగా కాపాడితేనే ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆర్కెపురం డివిజన్లోని పలు కాలనీలలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, శ్రీధర్‌రావు, సుజాతరెడ్డి, సూపర్వైజర్లు కీర్తి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గార ఉదయానంద్‌గుప్తా, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్, ఉపకమిషనర్ సుజాత, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మారుతి నగర్ సంక్షేమ సంఘం సభ్యులు మల్లేశం, కామేశ్వరరావు, రాజేశ్వర్‌గౌడ్, కుమారస్వామి, వైష్ణవిప్రసాద్, బాబాయ్, తోట మహేందర్ యాదవ్, నీలిమ, ప్రేమ్, చిరంజీవి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

**నాగోల్ డివిజన్‌లో...** ప్రతీ పౌరుడు విధిగా పరిశుభ్రత పాటించినప్పుడే వ్యాధుల భారీ నుంచి బయటపడతామని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్‌లో సోమవారం స్వచ్ఛదనం, పచ్చదనం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ తిప్పత్తి యాదయ్య, ఏఎమ్‌హెచ్‌ఓ లావణ్య, బలరాం, మేద, రవీంద్రనాథ్‌రెడ్డి, రవీంద్రబాబు, యాదగిరి, రాంకీ, సాయికుమార్ పాల్గొన్నారు.

**మారుతినగర్‌లో...** కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లో జరిగిన స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్, ఉపకమిషనర్ సుజాత, లైన్స్‌క్లబ్ హెల్త్ క్యాంప్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురంలో బోనాల ఉత్సవాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ తదితరులు

**వనస్థలిపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త:** వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలోని శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో జరిగిన అమ్మవారి బోనాల ఉత్సవాలలో కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కొప్పుల నరసింహరెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, పవన్, మాజీ కార్పొరేటర్ ముదగోని లక్ష్మిప్రసన్నరామ్మోహన్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు తదితరులు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అధ్యక్షుడు రాంరెడ్డి, డొక్కా సూర్యనారాయణ, నారాయణ, ప్రసాద్, కృష్ణారెడ్డి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 5 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బిజెపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బిజెపి భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు వాటికి అనుబంధంగా ప్రకటించిన ఇతర వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేసారు. బిజెపిని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, కొత్తకాపు అరుణ, శ్వేత, నాయకులు సందడి సురేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుభాష్‌చందర్‌జీ, దినేష్, భరత్, సురేందర్, గజానంద్ పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో ఘనంగా స్వచ్ఛ, పచ్చదనం



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ బన్నాల గీత, డిసి అంజనేయులు

**ఉప్పల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారంనుంచి స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. చిలుకానగర్ డివిజన్ ధర్మపురికాలనీలో జరిగిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, డిసి అంజనేయులు, శానిటేషన్ డిఇ చందన, సూపర్‌వైజర్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో 5 రోజులపాటు వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వ్యర్థాల తొలగింపు, దోమలనివారణ, చెరువులసంరక్షణ, నాలాల క్లీనింగ్, వన మహోత్సవం కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, శ్రీనివాస్, పాపిరెడ్డి, కాలనీ సంఘం అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, మాణిక్‌ప్రభు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: మీర్‌పేట్ మేయర్ దుర్గ



ర్యాలీని ప్రారంభించి పాల్గొన్న మీర్‌పేట్ మేయర్ దుర్గ దీప్‌లాల్

**సరూర్‌నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు 5 రోజుల పాటు తలపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మీర్‌పేట్ కార్పొరేషన్ కమీషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మీర్‌పేట్ టిఆర్ఆర్ చౌరస్తా నుండి జిల్లెలగూడ అంబేద్కర్ విగ్రహం చౌరస్తా వరకు పర్యావరణ పరిరక్షణ, కాలుష్యనివారణ, చెట్ల పెంపకం, వాటి ఆవశ్యకత, ప్రయోజనాలపై ప్రజలను చైతన్యవంతులను చేసే ఉద్దేశ్యంతో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ దుర్గ మాట్లాడుతూ పచ్చదనం, కాలుష్య నివారణలో కార్పొరేషన్‌ను జిల్లాలోనే అగ్రగామిగా నిలపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఇఇ వెంకన్న, ఎఇఇ శ్రీనివాసులు, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ రమేష్, కార్పొరేటర్లు గజ్జెల రాంచందర్, కొంద్రు గౌరీ శంకర్, సిద్దాల పద్మ అంజయ్య, ఇంద్రావత్ రవినాయక్, రాత్లావత్ నీలా రవినాయక్, అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్, జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వైదేహి ఆశ్రమానికి నాగార్జున విద్యార్థుల వితరణ



అనాథాశ్రమానికి బియ్యం, కందిపప్పు అందజేస్తున్న విద్యార్థులు

**సైదాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ గాయత్రినగర్ చౌరస్తాలోని నాగార్జున ది నెక్ట్స్ జెన్ పాఠశాల విద్యార్థులు వైదేహి అనాథ బాలికల ఆశ్రమానికి 5 క్వింటాళ్ల బియ్యం, 50 కిలోల కందిపప్పును విరాళంగా అందజేశారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన చారిటీ డే సందర్భంగా విద్యార్థులు సేకరించిన సరుకులకు తోడుగా యాజమాన్యం మరికొంత కలిసి ఆశ్రమానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించి, సమాజంలోని అభాగ్యుల పట్ల అవగాహన కల్పించడానికి సంవత్సరానికి ఒకరోజు తమ విద్యాసంస్థల్లో ఛారిటీడేను నిర్వహిస్తున్నామని అన్నారు. చిన్నారుల్లో ఉన్నత విలువలు పెంపొందించడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కట్టా రవీందర్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు డి.సువర్చల, పి.అంబదాస్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాదర్‌గుల్‌లో జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**సరూర్‌నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్‌లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1994-95 బ్యాచ్‌కు చెందిన టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందడిగా జరిగింది. పూర్వ విద్యార్థి ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో స్థానిక విఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగినీ కార్యక్రమానికి ఆనాటి పూర్వవిద్యార్థినీ విద్యార్థులతో పాటు అప్పటి ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసు కుంటూ వారు సంతోషంగా గడిపారు. సమ్మేళనం సందర్భంగా చదువులు చెప్పిన గురువులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నర్సింహాచారి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, పూర్వ విద్యార్థులు కందాడి మహిపాల్‌రెడ్డి, గణేష్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సిఓడబ్ల్యుఇ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

**నేరెడ్‌మెట్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** మహిళల సాధికారత, అభివృద్ధి వారికి నైపుణ్యం కోసం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా చేస్తున్న కృషి ఎనలేనిదని బీజెపి మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వడ్డి సుబ్బారావు అన్నారు. సోమవారం ఆనంద్‌బాగ్‌లోని ఆర్.కె నగర్‌లో మహిళల కోసం 6 వారాల ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఆయన స్థానిక కార్పొరేటర్లు క్యానం రాజ్యలక్ష్మి, శ్రావణ్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ ద్వారా గత 18సంవత్సరాల నుండి మహిళల సాధికారత కొరకు కృషి చేయడం జరుగుతుందన్నారు. కంప్యూటర్ నేర్చుకోవాలనే ఆసక్తి కలిగిన 30 మంది ఔత్సాహిక అభ్యర్థులను గుర్తించి ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సుమతి, చేతనా జైన్, కల్పనరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## వాయినాడు వరద బాధితుల కోసం సిపిఐ నాయకుల విరాళాల సేకరణ

**తుర్కయంజాల్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ సిపిఐ సమితి ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రంలోని వాయినాడు వరద బాధితుల కోసం విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ సిపిఐ పిలుపు మేరకు వరద బాధిత ప్రజలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. 2 గంటలపాటు జరిగిన కార్యక్రమంలో మొత్తంగా 3620 రూపాయలు జమ కాగా వీటి మొత్తం సిపిఐ తరఫున వాయినాడు విరాళాల రూపేనా జిల్లా పార్టీనుండి రాష్ట్ర పార్టీకి పంపించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిశివకుమార్, శ్రీకాంత్, సుందరమ్మ, లక్ష్మి, బోడి, గండికోట శివ, దీప్లా నాయక్ కోట్య, నాగేశ్వర్‌తోపాటు ఆటో యూనియన్ నాయకులు చెక్క యాదగిరి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్‌లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం : ప్రేమ్‌కుమార్



కాలనీవాసులకు మొక్కలను అందజేస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

**మల్కాజిగిరి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పివిఎన్ కాలనీలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం పచ్చదనం గురించి కాలనీలో అవగాహన చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలోభాగంగా డివిజన్‌లో ప్రతి కాలనీలలో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ శేఖర్, రాములు, యాదగిరి, బాబు, సత్యనారాయణ, రోజారమణి, శివకుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని డిసిపికి కార్పొరేటర్ వినతి



డిసిపి ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** జాతీయ రహదారి పక్కన జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టే విధంగా ప్రత్యేక తీసుకోవాలని గడ్డి అన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని కార్పొరేటర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిల్‌షుక్‌నగర్ మెయిన్‌రోడ్ సాయిబాబా దేవాలయం సర్వీస్‌రోడ్డు, చైతన్యపురి మెట్రో సమీపంలో వీధి వ్యభిచారం, ట్రాన్స్జెండర్ల సమస్య, వివిధ కాలనిలో యువత డ్రగ్స్ వాడకంపై కఠిన చర్యలు చెప్పట్టాలని డీసీపీకి వివరించానని తెలిపారు. సమస్య తీవ్రత గురించి రాత్రి 9 గంటల నుండి మెయిన్‌రోడ్డుపై అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని,కాలనీలోపలికి మహిళలు, పిల్లలు రావాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినట్లు డీసీపీకి వివరించడం జరిగిందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందిని పరిగణంలోకి తీసుకొని పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. డీసీపీ సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు చేపడుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రులకు అప్పగింత

**ఉప్పల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో తప్పిపోయిన రెండేళ్ల చిన్నారిని పోలీసులు సకాలంలో స్పందించి గంటలోపు తల్లిదండ్రులకు అప్పగించారు. సిఐ ఎలక్షన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట, ఇస్మాయిల్‌నగర్‌కు చెందిన ఎం.డి.మజీద్, మరియాబీ కుమారుడు ఎం.డి. అన్వాస్ (2) సోమవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో రామంతాపూర్ కెసిఆర్‌నగర్ పాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద ఉండగా కనిపించకుండా పోయినట్లు తెలిపారు. దీంతో పోలీసులు గంటలోపు గాలించి తిరిగి చిన్నారిని తల్లికి అప్పగించారు. సకాలంలో స్పందించిన పోలీసులకు తల్లి మరియాబీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు పలువురు స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు : భాగ్యలక్ష్మి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, ఆగస్టు 5 ప్రభాతవార్త:** మూసారాంబాగ్ డివిజన్‌లో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపట్టాలని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని కృష్ణ తులసినగర్‌లోని కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 20 లక్షలతో కాంపౌండ్ వాల్‌ను నిర్మించనున్నట్లు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి సురేంద్ర, కొంగర ప్రవీణ్, జయరాజ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## శివసాయిలో గౌరీ మాతకు కుంకుమార్చన పూజలు

**సరూర్‌నగర్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** పవిత్ర కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివసాయినగర్ కాలనీలో గౌరీ మాతకు కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీవాసులు భవ్యమైన ఆలయంగా నిర్మించుకున్న స్థానిక శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో సుహాసినిలు భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన పూజలు జరిపారు. మీర్‌పేట్ గాయత్రీ సేవా సంఘం సహకారంతో ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కుంకుమార్చన పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దోమల నియంత్రణపై అవగాహన సదస్సు



దోమల నియంత్రణలో భాగంగా అవగాహన కల్పిస్తున్న డీసి రాజు, సిబ్బంది

**నేరెడ్‌మెట్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** మల్కాజిగిరి మున్సిపల్ పరిధిలోని డివిజన్లలో దోమల నియంత్రణ, స్వచ్ఛభారత్ కార్యక్రమాలపై నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని భాను ఎన్క్లేవ్‌లో సోమవారం డిప్యూటీ కమీషనర్ రాజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇళ్ళలో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచితే దోమలు దరి చేరవన్నారు. ఎక్కడైతే అపరిశుభ్రంగా ఉంటుందో అక్కడ దోమలు విజృంభించి ప్రజలు పలు రోగాల బారిన పడే విధంగా చేస్తాయన్నారు. సర్కిల్ పరిధిలోని ప్రజలందరూ తమవంతు బాధ్యతగా ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక ఏసిపి శ్రీనివాస్ యాదవ్, ఏఇ సృజన, నాగరాజు, రమేష్, శ్యామ్, సుధీర్, రమేష్, శోభారాణి, రమాదేవి, చంద్రకళ, బబిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం: చైర్మన్ రాంరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ రాంరెడ్డి, చైర్‌పర్సన్ అనురాధ తదితరులు

**తుర్కయంజాల్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ పరిధిలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రజలు భాగస్వాములై, పురోభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితధనరాజ్‌గౌడ్, కౌన్సిలర్లు, విద్యార్థులతో కలిసి స్వచ్ఛదనం పచ్చదనం ప్రారంభ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వాములై అన్నికాలనీలలో పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుటకు ప్రతి ఒక్కరూ కలిసిరావలన్నారు. అనంతరం వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలను నాటారు. వచ్చే 3 నెలలో పురపాలిక రూపు రేఖలు మారునున్నట్లు తెలిపారు. పలు పాఠశాల నుండి వచ్చిన విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మా శివకుమార్, వైస్ చైర్‌పర్సన్ హరిత ధన్‌రాజ్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షురాలు కౌన్సిలర్ కొత్తకుర్మా మంగమ్మ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్లు కోసికే ఐలయ్య, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డితోపాటు సిబ్బంది, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణాలో ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



తెలంగాణ ఎస్సీ ఉపకులాల ఐక్యవేదిక సదస్సులో పాల్గొన్న అధ్యక్షుడు తూర్పాటి హనుమంతు, మేడిపాపయ్య తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** తెలంగాణలో ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ ఎస్సీ 57 ఉపకుమాల ఐక్య వేదిక అధ్యక్షుడు తూర్పాటి హనుమంతు, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మేడి పాపయ్య, హోలియా దాసరి సంఘం నేత జహంగీర్, డక్కలి సంఘం నేత మంగేష్, కర్నె ముత్యాలు, మాస్సిన్ రాగడి కృష్ణయ్య, మోచె నేత దేవరకొండ కామరాజు, డక్కలి సంఘం నేత కె.రాములమ్మ, బైండ్ల సంఘం నేత మురళీ, చిందు నేత గడ్డం సంజీవ, బేడ బుడగ జంగాల నేత గగనం వెంకటస్వామి, తూర్పాటి కృష్ణ, దాసరి వీరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70సంవత్సరాలు గడిచినా ఎస్సీ ఉపకులాలకు డా.అంబేద్కర్ ఆశయాలను పొందలేకపోతున్నామని తెలిపారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని, కొత్తగా సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కూడా తమ వర్గానికి ఎమ్మెల్యే, ఎంపి టిక్కెట్లు కేటాయించాలని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తమకు అనుకూలంగా రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్సీ ఉపకులాల సంఘం నేతలు పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం..పచ్చదనంలో భాగంగా మొదటి రోజు వ్యర్థాల తొలగింపు



కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత

**సైదాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి చేపట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని మొదటిరోజు లింగోజిగూడడివిజన్‌లో కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఐఎస్ సదన్ డివిజన్‌లో కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి, సైదాబాద్ డివిజన్‌లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయిదు రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల తొలగింపు, దోమల నివారణ, చెరువుల సంరక్షణ, నాలాల క్లీనింగ్, మనమహోత్సవం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మొదటి రోజు వ్యర్థాల తొలగింపులో భాగంగా ప్రజలకు వారు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. చెత్తను కవర్లలో మూటగట్టి ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని, దీని వల్ల అపరిశుభ్రత తలెత్తి దుర్వాసన, దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతారని అన్నారు. లింగోజిగూడ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో డిసి జకియా సుల్తానా, శానిటేషన్ డిఇ వెంకటేషన్, ఐఎస్ సదన్ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో జోనల్ కమీషనర్ వెంకన్న, డిసి సురేందర్, డిపిఓ రత్నమాల, సైదాబాద్ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో డిసి జయంత్ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలి : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



కార్యక్రమంలో మొక్కలను అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, ఆగస్టు 5 ప్రభాతవార్త:** బి.యన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయ నగర్‌లో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ యాదయ్య, డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ద్వారా డివిజన్‌లో ప్రతి కాలనీలలో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కుక్కల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అనంతరం పండ్ల మొక్కలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో డిఇ లావణ్య, హార్టికల్చర్ మేనేజర్ మేధ,జిహెచ్ఎంసి ఎస్ఎస్ అజీమ్‌ద్దీన్, జవాన్ రామ్‌చందర్, ఆఫీసర్ రాజు, ఎస్ఎఫ్ఏ చంద్రశేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.